

సోమశిలలో 30.31 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 30.318 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 136 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,642
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,811
నవర (8 గ్రాములు)	రూ.46,488

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /25.4

గాలిలో తేమ 52 శాతంగా బుధవారం నమోదైంది. ఎండ తీవ్రత, ఉక్కపోత గురువారం సాధారణంగానే ఉంటాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రికార్డులను పక్కాగా నిర్వహించండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు(పొగతోట): నిబంధనల మేరకు రికార్డులను నిర్వహించాలని డీఎస్‌ఓ, ఇన్‌చార్జి డీఎం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సివిల్ సప్లయ్స్ సంస్థ అధికారులు, ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గోదాములు, బియ్యం నిల్వలు, రేషన్ సరఫరా తదితరాల వివరాలను పక్కాగా నిర్వహించాలని చెప్పారు.

డీఆర్వో బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): డీఆర్వోగా లవన్న బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బదిలీ అయిన డీఆర్వో వెంకటనారాయణమ్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ సూచనలు, అధికారుల సహాయ సహకారాలతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. డీఆర్వోను ఏపీఆర్ఎస్ఏ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. సెప్టెంబర్ 19 నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.30,59,209 మేర సమర్పించారని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు. హుండీల్లో రూ.30,16,718, అన్నదాన హుండీ ద్వారా రూ.42,491 సమర్పించారన్నారు. 40.2 గ్రాముల బంగారం, 123 గ్రాముల వెండిని సమర్పించారన్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు గూడంశెట్టి దొరబాబు, మల్లు రామ్మోహన్‌రెడ్డి, పెంచలమ్మ, భారతి, దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు పతకాలు



సాధించిన పతకాలతో క్రీడాకారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ఎనిమిది పతకాలను సాధించారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం వారు తెలియజేశారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లిలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన జూనియర్స్, సీనియర్స్ విభాగాల ఆర్చరీ పోటీల్లో జూనియర్స్ బాలికల విభాగంలో దీక్షాచంద్రిక రజత, బాలుర విభాగంలో వెంకటలోకేష్ కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. సీనియర్స్ పురుషుల విభాగంలో వెంకటలోకేష్ రజత, సీనియర్స్ మహిళల విభాగంలో దీక్షాచంద్రిక కాంస్య పతకాలను సాధించారన్నారు. జూనియర్స్ రికర్వ్ రౌండ్‌లో బాలుర విభాగంలో సాయి మౌర్య స్వర్ణ, తరుణీష్ జాత్యా రజత, సీనియర్స్ రికర్వ్ రౌండ్ పురుషుల విభాగంలోనూ వీరు పతకాలను సాధించారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు వీరు అర్హత సాధించారన్నారు.

నిశ్చింతగా వంట

పేద విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించి.. వారికి పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని గత పాలకులు మిథ్యగా మార్చారు. అరకొరగా అందుబాటులో ఉన్న వంటపాత్రలతో చిన్నారులకు భోజనం అంతంతమాత్రంగానే అందేది. ఈ కష్టాలకు చెక్ పెట్టేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే జగనన్న గోరుముద్ద పేరుతో రోజుకో రకం వంట చేస్తూ విద్యార్థులకు భోజనం పెడుతున్న ప్రభుత్వం తాజాగా నూతన వంట పాత్రల సరఫరాకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ నిర్ణయంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'మధ్యాహ్న' ఘుమఘుమలు

- పాత సామగ్రి స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు
- 5 నుంచి 11 రకాల సరఫరా
- విద్యార్థుల సంఖ్యను బట్టి అందజేత
- ఇప్పటికే ఆరు మండలాలకు చేరిన వైనం

జిల్లాలో ఇదీ తీరు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలు	నూతన వంట పాత్రలు:
2,285	2,285 పాఠశాలలకు



కొడవలూరు మండల పాయింట్‌కు చేరిన కొత్త వంట పాత్రలు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేసి.. విద్యా ప్రమాణాల పెంపునకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మరో నిర్ణయం తీసుకుంది. ఎప్పుడో 2010లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందజేసిన వంట పాత్రల స్థానంలో నూతన సామగ్రిని సమకూర్చుతోంది. పాత సిల్వర్ పాత్రల స్థానంలో నాణ్యతతో కూడిన స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను వంట ఏజెన్సీల నిర్వాహకులకు అందజేస్తోంది. సరిపడా పాత్రలు ఉండటంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సకాలంలో అందించేందుకు అవకాశం ఏర్పడనుంది. ఇప్పటికే జిల్లాలోని ఆరు మండలాల్లో గల 267 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు.

ప్రభుత్వాలు మారినా.. మారని తీరు

వాస్తవానికి 2010 తర్వాత పలు ప్రభుత్వాలు వచ్చినా ప్రభుత్వ పాఠశాలల్లో వంట పాత్రల మార్పుపై దృష్టి సారించలేదు. ఫలితంగా ఏళ్ల నాటి పాత్రలతో ఏజెన్సీల నిర్వాహకులు రోజూ అవస్థ పడేవారు. ఫలితంగా విద్యార్థులకు అరకొరగా భోజనం అందేది. సమస్యను దృష్టిలో ఉంచుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నూతన వంట పాత్రలను అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

2,285 పాఠశాలలకు

జిల్లాలో 2,575 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 2027 ప్రాథమిక, 254 ప్రాథమికోన్నత, 294 ఉన్నత పాఠశాలలు. జిల్లాలో అక్షయపాత్ర నిర్వాహకులు 192 ప్రభుత్వ పాఠశాలలకు.. ఇస్కాన్ నిర్వాహకులు 98 పాఠశాలలకు భోజనాన్ని సరఫరా చేస్తున్నారు. మిగిలిన 2285 ప్రభుత్వ పాఠశాలల్లోనే వంటను వండి విద్యార్థులకు భోజనాన్ని ఏజెన్సీలు అందిస్తున్నాయి. ఈ పాఠశాలలకు స్టీల్ పాత్రలను సరఫరా చేయనున్నారు. తాజాగా తొలి విడతలో జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో గల 267 పాఠశాలల్లో ఏజెన్సీలకు సరఫరా చేశారు.

సరఫరా ఇలా..

ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల వంట పాత్రలను సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రాల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఆయా పాఠశాలలకు చేరుస్తున్నారు. దీనికి సంబంధించిన రవాణా బిల్లులనూ రాష్ట్ర ప్రభుత్వమే మంజూరు చేసింది. పాత్రల తరలింపునకు రూ.3.42 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.



విద్యార్థులకు రాగి జావను అందజేస్తూ..

నాణ్యతగా.. రుచిగా

గత టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు భోజనాన్ని మొక్కుబడిగా అందించేవారు. ఏజెన్సీల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అరకొరగా భోజనం పెట్టే పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం సర్కారీ బడులపై దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని జగనన్న గోరుముద్ద ద్వారా ప్రస్తుతం అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా రోజుకో ప్రత్యేక వంట చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు చిక్కీలను అందజేస్తున్నారు. నూతన వంట సామగ్రిని అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఏజెన్సీల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సరిపడా వంట పాత్రలు లేకపోవడం .. ఉన్నవీ పాడవడంతో ఇబ్బందులు పడేవాళ్లమని, ఇప్పుడెలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో మధ్యాహ్న భోజనాన్ని అందించగలమని చెప్తున్నారు.

వంట పాత్రలను అందజేయడం సంతోషం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు కొత్త వంట పాత్రలను అందజేయడం ఎంతో సంతోషం. గతంలో పాత్రలను ఎప్పుడో ఇచ్చారు. దీంతో కొంతమంది కార్మికులు కొత్త పాత్రలను కొనుగోలు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడా బాధ తప్పింది.

– రెహానాబేగం, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సంఘ జిల్లా కార్యదర్శి

మండల పాయింట్ల నుంచి పాఠశాలలకు



మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకుల కోసం కొత్త వంట పాత్రలను మండల పాయింట్ల నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం. అన్ని పాఠశాలలకు త్వరలో పంపిణీ పూర్తి చేస్తాం. కొత్త వంట పాత్రలు చాలా నాణ్యతగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు అందజేస్తున్నాం.

– గంగాభవాని, డీఈఓ

నేత్రపర్వంగా నృసింహుని కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

రాపూరు: పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో దేవదేవేరుల కల్యాణాన్ని జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంకల్పించారు. తొలుత రాపూరులో కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో ఉత్సవర్లను కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఈఓ జనార్దన్‌రెడ్డి, పెంచలకోన ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటనారాయణమ్మకు ఆత్మీయ వీడ్కోలు



సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): డీఆర్వోగా విశిష్ట సేవలందించి పర్యాటక శాఖ అనంతపురం ఆర్డీడీగా బదిలీపై వెళ్తున్న వెంకటనారాయణమ్మను కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం సత్కరించారు. కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డీఆర్వోగా నారాయణమ్మ తన విధులను సమర్థంగా నిర్వర్తించారని కొనియాడా రు. ఆర్డీఓ మలోల, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి నిర్మలాదేవి, కలెక్టర్ ఏఓ షఫీమాలిక్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధి కారి వెంకటయ్య, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల మెరుగునకు దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు మెరుగుపడేలా కృషి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న వైద్యసేవలు, న్యూట్రిషన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో వైద్యాధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించి ప్రభుత్వాస్పత్రులపై మరింత నమ్మకాన్ని కల్పించాలని సూచించారు. జీజీహెచ్‌లో రోగుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. పౌష్టికాహారం అందక, తక్కువ బరువుతో జన్మిస్తున్న పేద కుటుంబాల పిల్లలను గుర్తించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు నిర్దేశించిన న్యూట్రిషన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్‌ను జీజీహెచ్‌లో అన్ని వసతులతో నెల్లోపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు ఈవీఎంల తనిఖీ

నెల్లూరు రూరల్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోపు ఈవీఎంల తనిఖీని పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద గల ఓటింగ్ యంత్రాల గోడౌన్లో ఈవీఎంల పర్యవేక్షణాధికారి, భెల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవీఎంల తనిఖీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రక్రియను వచ్చే నెల పదిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైనా లోపాలుంటే వాటిని వేరుగా భద్రపర్చాలని సూచించారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీఆర్వో లవన్న, ఆర్డీఓ మలోల, ఈవీఎంల సూపర్‌వైజర్ సుధాకర్‌రావు, ఓబులేసు పాల్గొన్నారు.

గోకులాలకు పునరుజ్జీవం

తారస్థాయికి చేరిన గత ప్రభుత్వ పాపాలను ప్రస్తుత ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. జిల్లాలో వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి పేరుతో రైతులను గత టీడీపీ ప్రభుత్వం నట్టేట ముంచింది. మినీ గోకులాలు, గోకులాలను నిర్మించాలని ఉత్తర్వులు జారీ చేసి.. ఆపై బిల్లులు చెల్లించకుండా అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఈ క్రమంలో రైతుల సౌకర్యార్థం ఈ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 400కుపైగా మినీ గోకులాలు, గోకులాలకు బిల్లులను చెల్లించారు.

- జిల్లాలో 1723 మినీ గోకులాలు, గోకులాలు
- బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం
- చేతులెత్తేసిన గత పాలకులు
- వారి తీరుతో నట్టేట మునిగిన రైతులు



నెల్లూరు(పొగతోట): మినీ గోకులాలు, గోకులాల నిర్మాణాల పేరుతో రైతులను గత ప్రభుత్వం వంచించింది. 90 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రచారం చేసి, 10 శాతం వాటాను రైతులతో కట్టించారు. నిర్మాణాలను పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని ప్రచారం చేయడంతో రైతులు అప్పులు చేసి మరీ గోకులాలు, మినీ గోకులాలను చేపట్టారు. అయితే అనంతరం మోసం చేయడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి. ఈ తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి నిర్మాణాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాల్సిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఉపాధి హామీ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అప్‌లోడ్ చేయడంతో బిల్లుల చెల్లింపు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు రూ.12 కోట్లను చెల్లించారు.

ఇదీ తీరు..

పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులు జిల్లాలో అధిక శాతం మంది ఉన్నారు. పశువుల సంరక్షణ.. ఉత్పత్తిని పెంచేందుకు గోకులాలు, మినీ గోకులాల నిర్మాణాలకు 2018–19లో అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పది శాతాన్ని వాటాగా రైతులు చెల్లిస్తే, నిర్మాణం పూర్తయిన వెంటనే 90 శాతం సబ్సిడీ నిధులను మంజూరు చేస్తామని ప్రచారం చేసింది. 20 పశువులుండే గోకులానికి రూ.13 లక్షలు, 2, 4, 6 పశువులుండే మినీ గోకులానికి వరుసగా రూ.90 వేలు, రూ.1.4 లక్షలు, రూ.1.7 లక్షల్లో నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలను రూపొందించారు. జిల్లాకు 1723 గోకులాలు, మినీ గోకులాలను మంజూరు చేయగా, 404 గోకులాల పనులను ప్రారంభించలేదు. బేస్‌మెంట్ స్థాయిలో 371, రూఫ్ లెవల్లో 349, గోకులాలు, మినీ గోకులాలను 599 మేర పూర్తి చేశారు. అయితే నిర్మాణాలను పూర్తి చేసినా, సబ్సిడీ నిధులివ్వకుండా గత ప్రభుత్వం చేతులెత్తేసింది.

ప్రస్తుతం ఇలా..

అన్నదాతల సౌకర్యార్థం బిల్లుల చెల్లింపునకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణాలు పూర్తయినవి, వివిధ దశల్లో ఉన్న గోకులాలు, మినీ గోకులాలను మాత్రమే పరిశీలించి వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపడతారు. ప్రారంభంకాని గోకులాలను పరిగణనలోకి తీసుకోరు. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు 400కుపైగా మినీ గోకులాలు, గోకులాలకు బిల్లులు చెల్లించారు. మిగిలిన వాటికి బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

చెల్లింపులు జరుగుతున్నాయి



గతంలో నిర్మించిన మినీ గోకులాలు, గోకులాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. పశుసంవర్ధక శాఖ అధికారులు, డ్వామా సిబ్బంది పరిశీలించి వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. బిల్లుల చెల్లింపు ప్రక్రియ జరుగుతోంది. నిర్మాణాలను పూర్తి చేసి.. అసంపూర్తిగా ఉన్న వాటి వివరాలను మాత్రమే అప్‌లోడ్ చేస్తున్నారు.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

వన్నె తగ్గిన నిమ్మ

- దక్షిణాది రాష్ట్రాలకే ఎగుమతులు



యార్డుకు వచ్చిన నిమ్మ

పొదలకూరు: శరన్నవరాత్రుల అనంతరం నిమ్మకాయల ధరలు తగ్గిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర రూ.20 నుంచి రూ.50 వరకే పలుకుతోంది. రైతులకు ఎన్ని ఒడిదొడుకులున్నా నిమ్మ సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం తగ్గిన ధరలు వచ్చే ఏడాది జనవరి చివరి వరకు ఉండే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకే ఎగుమతి చేస్తున్నారు. చలికాలంలో నిమ్మకాయల వాడకం గణనీయంగా తగ్గుతుంది. గతేడాదితో పోలిస్తే వర్షాలు తక్కువగా ఉన్నాయి. నిమ్మ వాడకం ప్రస్తుతం మోస్తరుగా ఉన్నా ధరలు దిగజారుతున్నాయి. నిమ్మ తోటల్లో కాయల దిగుబడి పెరిగినా, ధరలు పతనమవుతుండటం రైతులకు ఇబ్బందిగా మారింది. మచ్చలు అధికంగా ఉండటంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కాయలు కోసిన అనంతరం ప్రాథమిక జాగ్రత్తలను పాటించకపోవడంతో నాణ్యత దెబ్బతింటోంది.

ఘనంగా ఎంపీ ఆదాల జన్మదినం





శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీలు వేమిరెడ్డి, మాగుంట

నెల్లూరు రూరల్: ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగరంలోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలియజేసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం ఎంపీని పలువురు గజమాలలతో సత్కరించారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి శుభాకాంక్షలు

ఎంపీ ఆదాల జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షించారు. ఈ మేరకు ఓ లేఖను ఎంపీ నివాసానికి పంపారు.

ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా

- విక్రయాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల ప్రత్యేక దృష్టి
- ఎనిమిది నెలల్లో 67 కేసుల నమోదు
- నాణ్యత లేకుంటే జరిమానాతో పాటు జైలు శిక్ష



ఆహార తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆహార విక్రయాల్లో నాణ్యత పాటించని వారిపై చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజలు వినియోగించే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించినా, నకిలీ వినియోగం చేసినా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆహార విక్రయాలపై ప్రతి చోటా దృష్టి సారించి తనిఖీలను ముమ్మరం చేశారు.

67 కేసుల నమోదు

జిల్లాలో ఆహార విక్రయాలు చేసే హోటల్స్, దుకాణాలు, ఇతర షాపుల్లో ఫుడ్‌కంట్రోల్ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. గత ఎనిమిది నెలల కాలంలో ప్రజల ప్రాణాలకు హాని కలిగించే నిర్వాహకులపై 67 కేసుల వరకు నమోదు చేశారు. దాదాపుగా రూ.6.70 లక్షల పెనాల్టీ వరకు విధించారు. విక్రయాలు చేసే ఆహారాలను పరిశీలించి, వాటిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేసిన తరువాత కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తుంటారు. నిబంధనలు అతిక్రమించారని కేసులు నమోదు చేసినా తిరిగి అదే తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

ప్రత్యేక పరికరాలు

జిల్లాలో నాణ్యత లేని నూనెను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక పరికరాలతో తనిఖీలు చేస్తున్నారు. ఆహార పదార్థాల తయారీలో వినియోగించే వంటనూనెను పదేపదే కాగిస్తూ వినియోగిస్తే జీర్ణకోశ వ్యాధులు వస్తాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఇటీవల కాలంలో టోటల్ పోలార్ కాంపోర్డ్ (టీపీసీ) అనే పరికరం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరికరం ద్వారా నూనెను పరీక్ష చేసిన తరువాత నాణ్యత లేదని తెలిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు.

600 మందికి శిక్షణ...

ప్రభుత్వ చొరవతో ఓ ప్రైవేటు కంపెనీతో కలిసి జిల్లాలో వివిధ చోట్ల ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించి 600 మంది చిన్న వాపారులకు ఫుడ్‌కంట్రోల్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలంటే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, ఎటువంటి నిబంధనలు పాటించాలి, ప్రజలకు ఆరోగ్యమైన ఆహారాన్ని ఏ విధంగా అందించాలనే విధంగా ఉచితంగా ఐదు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మూడు రకాల లైసెన్స్‌లు జారీ

ఆహార విక్రయాలకు సంబంధించి మూడు రకాల లైసెన్సులను ఫుడ్‌కంట్రోల్ అధికారులు జారీ చేస్తారు. ఏడాదికి రూ.12 లక్షలలోపు వ్యాపారం చేసే వారు ఫుడ్‌కంట్రోల్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకు ఏడాదికి రూ.100 రిజిస్ట్రేషన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటోంది. ఏడాదికి రూ.12 లక్షల పైన రూ.20 కోట్ల లోపు వ్యాపార లావాదేవీలు జరిపే వ్యాపారులు మరో రకమైన లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.2 వేలు నుంచి రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆయా దుకాణాలు, పరిశ్రమల ఆధారంగా లైసెన్సు ఫీజు ఉంటుంది. ఏడాదికి రూ.20 కోట్ల పైన వ్యాపార లావాదేవీలు జరిపే వ్యాపారులు సెంట్రల్ లైసెన్సులు పొందాల్సి ఉంటుంది. ఈ విధంగా ఆయా వ్యాపార లావాదేవీలకు అనుగుణంగా లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది.

లైసెన్సులు తీసుకోవాలి



జిల్లాలోని ఆహార పదార్థాల విక్రయదారులు తప్పకుండా ఆయా పరిధిని బట్టి రిజిస్ట్రేషన్స్, లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. నాణ్యత లేని వాటిని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, పెనాల్టీ, జైలు శిక్ష తప్పనిసరిగా ఉంటుంది. ప్రజలు వినియోగించే ఆహార పదార్థాల్లో ఎక్కడా ఇబ్బందులు ఉండకూడదు.

– వెంకటేశ్వరరావు, జిల్లా ఫుడ్ కంట్రోల్‌అధికారి

సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : ఆత్మకూరు నియోజకవర్గంలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా 58 దేవాలయాలకు నిధులు మంజూరు చేయించడం పట్ల సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రెయిన్లు అవసరమని, వాటి నిర్మాణాలకు రూ.20 కోట్ల మేర నిధులు ప్రత్యేకంగా మంజూరు చేయించాలని కోరినట్లు తెలిపారు. అలాగే సోమశిల ఉత్తరకాలువ ద్వారా రెండు టీఎంసీల నీటిని ఆత్మకూరు రైతాంగం కోసం విడుదల చేయించేలా చూడాలని కోరినట్లు తెలియజేశారు.

ఉదయగిరిలో అధిక మెజారిటీ రావాలి

- సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన రాజారెడ్డి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజారెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీకి ఉదయగిరిలో అధిక మెజారిటీ తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి తెలిపారు. ఆయన తన తనయుడు అభినవ్‌రెడ్డితో కలిసి తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, వింజమూరు సమ్మర్ స్టోరేజీ, పర్యాటక అభివృద్ధికి నిధుల మంజూరుపై కూడా హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఈనెల 30న నియోజకవర్గంలో జరుగనున్న బస్సు యాత్రను కూడా జయప్రదం చేయాలని సూచించినట్లు రాజారెడ్డి తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఏడుగురికి గాయాలు



సంగం : ఆటోను కారు ఢీకొని ఏడుగురు గాయపడిన ఘటన మండలంలోని దువ్వూరు–సిద్ధీపురం మధ్యలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చేజర్ల మండలం ఓబులాయపల్లి గ్రామానికి చెందిన తొమ్మిది మంది సంగం వచ్చి అక్కడి నుంచి ఆటోలో బీచ్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా దువ్వూరు వద్ద ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారుకు ముందు టైర్ పంక్చర్ కావడంతో సంగం వైపు నుంచి వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది ప్రయాణికుల్లో ఏడుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీల సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జగనన్నకు చెబుదాం, గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శుల పనితీరు, జగనన్న సురక్ష తదితర అంశాలపై జిల్లా, మండల, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను అర్థం చేసుకుని సముచిత పరిష్కారం చూపాలని, రీఓపెన్ కేసులు రాకుండా పరిష్కారం చేయాలన్నారు. అర్జీదారులతో మాట్లాడి పరిష్కరించడం వల్ల పునరావృతమయ్యే కేసులు తగ్గుతాయని తెలిపారు. మనుబోలు మండలంలో భూ కేసుకు సంబంధించి అర్జీ పునరావృతం కావడంతో ఎందుకు సక్రమంగా పరిష్కరించలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సర్వే చేసి రాళ్లు వేసిన తరువాత కూడా రాళ్లు తీసివేశారని చెప్పడంతో అతనిపై కేసు నమోదు చేసి తనకు ఎఫ్ఐఆర్ పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కొందరు అధికారులు ఎన్నిసార్లు చెప్పినా తప్పుగా ఎండార్స్ చేస్తున్నారని, ఇలాంటివి సహించేది లేదని స్పష్టం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష చేస్తూ ఇప్పటికే జిల్లాలో 519 క్యాంపులు పూర్తయ్యాయని, 2.34 లక్షల మందికి ఓపీ చూశారని తెలిపారు. మిగిలిన క్యాంపులు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు గ్రామ, వార్డు కార్యదర్శులు లక్ష్యం మేరకు తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డీఆర్ఓ ఎస్.లవన్న, జిల్లా పరిషత్ సీఈఓ బి.చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య పాల్గొన్నారు.

హైవే పనుల్లో విషాదం



కందుకూరు : పట్టణ శివారు ప్రాంతంలో జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నీళ్ల ట్యాంకర్ తిరగబడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాయకొండ నుంచి కడప జిల్లా మైదుకూరు వరకు నిర్మిస్తున్న నూతన జాతీయ రహదారి 167బీ పనులు ప్రస్తుతం కందుకూరు పట్టణ శివారు ప్రాంతంలో జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో కృష్ణా జిల్లా నందిగామకు చెందిన మంద అభినయ్(18) అనే యువకుడు హైవే పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వద్ద చేరాడు. తన పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం నీళ్ల ట్యాంకర్‌ను తీసుకుకొచ్చి రోడ్డు క్యూరింగ్ చేస్తున్నాడు. ట్రాక్టర్‌పై ఉండి నీళ్లు పడుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ జారి కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ తిరగబడడంతో దానిపై ఉన్న అభినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చుక్కల దుప్పిని రక్షించిన యువకుడు



ఉదయగిరి : అటవీ ప్రాంతం నుంచి జనసంచారంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడిన దుప్పిని బుధవారం పట్టణానికి చెందిన కె.రోహిత్ అనే యువకుడు రక్షించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి నుంచి కావలి వెళ్లే మార్గంలో ఓ కాలనీ సమీపంలోకి ఓ చుక్కల దుప్పి రావడంతో కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దీనిని గమనించిన యువకుడు కుక్కల బారిన పడిన దుప్పిని రక్షించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకుని చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా దుప్పిని రక్షించిన యువకుడిని గ్రామస్తులు అభినందించారు.

మైపాడు బీచ్‌లో ఇద్దరు గల్లంతు



కైలాసం జోషి



రాహుల్

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు బీచ్‌లో ఇద్దరు వ్యక్తులు నీట మునిగి గల్లంతయ్యారు. పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాకు చెందిన కైలాసం జోషి (33), రాహుల్ భూత్(19) అనే ఇద్దరు వ్యక్తులు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సమీపాన ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వారి స్నేహితులు, బంధువులతో కలిసి ఏడుగురు బుధవారం ఆటోలో మైపాడు బీచ్‌కు వెళ్లారు. అందరూ సముద్రంలో ఆనందంగా గడుపుతూ ఉండగా కైలాసం జోషి, రాహుల్ భూత్ ఇద్దరు పక్కన కొద్ది దూరంలో మునుగుతూ ఉన్నారు. ఈ క్రమంలో అలల తాకిడికి వారిద్దరూ నీటిలో కొట్టుకుపోయారు. దీనిని గమనించిన తోటి వారు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటి వరకు తమతోనే ఉన్న వారు అంతలోనే గల్లంతవడంతో వారి బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరేంద్రబాబు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు ఆరాతీశారు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.124
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.218
స్కిన్‌లెస్ చికెన్:	రూ.240
లేయర్ చికెన్:	రూ.187



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి :	రూ.50
సన్నవి :	రూ.15
పండ్లు :	రూ.5

